
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 25 మార్చి 2025




రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం	సెహరి బుధవారం
కర్నూలు	6:35	4:56
నంద్యాల	6:31	4:56



పసి పాపం



అవగాహన కల్పిస్తున్నాం...

జిల్లాలో అక్కడక్కడా బాలికలపై అకృత్యాలు జరుగుతున్న విషయం వాస్తవమే. శక్తి టీమ్‌ల ద్వారా అవగాహన పెంచుతున్నాం. ఇదే క్రమంలో ఇలాంటి ఘటనలకు తావు లేకుండా పాఠశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎవరైనా బాలికలపై అకృత్యాలు, ఆగడాలకు పాల్పడితే చట్టాలను కఠినంగా అమలు చేస్తాం. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా పోలీసు నిఘా పెంచుతాం. బాలికలకు ఏదైనా సమస్య వస్తే.. డయల్ -100, 112, 181, 1098కు ఫోన్ చేయాలి. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటాం. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

-ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

- చిన్నపిల్లలపై పెరిగిపోతున్న అకృత్యాలు
- కీచక ఉపాధ్యాయులపై తీవ్ర విమర్శలు
- పోలీసుల చర్యలు అంతంత మాత్రమే
- తల్లిదండ్రుల్లో ఆందోళన

నంద్యాల, మార్చి24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పసిపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు ఆందోళన రేపుతున్నాయి. అభం శుభం తెలియని బాలికలపై జరుగుతున్న అత్యాచార ఘటనలు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు సైతం మృగాలుగా మారడం మరింతగా ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా అత్యాచార ఘటనలు ఆగకపోగా పెరిగిపోతుండడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

- ప్యాపిలి మండలం ఏనుగుమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొజ్జన్న విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.
- పగిడ్యాల మండల పరిధిలోని ఓ గ్రామంలో ఏడాది కిందట తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన బాలురు అత్యాచారం చేశారు. అనంతరం హత్య చేసి సదరు బాలిక మృతదేహాన్ని నదిలో పడేశారు. పోలీసులు పోక్సోతోపాటు హత్య కేసు నమోదు చేశారు.
- నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఓ వార్డెన్ మాయమాటలతో బాలికపై కొన్ని రోజుల కిందట అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత బాలిక కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- జూపాడుబంగ్లా మండలం పరిధిలో ఇటీవల ఓ వ్యక్తి తమకు బాగా తెలిసిన బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక గర్భం కూడా దాల్చింది. పోలీసులు సదరు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- పాణ్యం మండల పరిధిలోని ఓ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గత నెలలో ఓ బాలికపై అసభ్యంగా ప్రవర్తించారని, బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా రెండేళ్ల కిందట ఇదే మండల పరిధిలోని మరో పాఠశాలలోని ఓ ఉపాధ్యాయుడు ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారని తెలిసింది.



ఎక్కడ చూసినా అంతే...

పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా పసిపిల్లలపై అకృత్యాలు, మహిళలపై ఆగడాలు పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా చాలా వరకు బయటకు రానివ్వడం లేదు. తమ పరువు.. ప్రతిష్ట పోతుందనే భయంతో బయట పడడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మరీ దారుణం. గ్రామ పెద్దలు పంచాయితీలు చేసి కేసులు కాకుండా చేస్తున్నారు. పలుకుబడి ఉన్న నిందితులైతే బాధిత వర్గాలను పలు రకాలుగా బెదిరించి దర్జాగా తిరుగుతున్నారు. కొన్ని చోట్ల పోలీసులే రాజీ చేసి తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

గత రెండేళ్లలో నమోదైన కేసులు ఇలా...

సంవత్సరం	: 2023	2024	2025
పోక్సో కేసులు	49	35	08
వేధింపుల కేసులు	720	481	111
అత్యాచారాలు	03	03	02

ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన



పసిపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు సైతం కొందరు కీచకులుగా వ్యవహరిస్తున్నారు. పాణ్యంతోపాటు ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించి సస్పెన్షన్ కావడమే ఇందుకు నిదర్శనం. ఇలాంటి ఘటనలు ఇప్పుడేమి కొత్త కాదని, గతంలోనూ చాలా జరిగాయని తెలుస్తోంది. ఈక్రమంలో పసిపిల్లలను పాఠశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులు జంకాల్సిన దుస్థితి నెలకొంది.

అవగాహన.. పోలీసు నిఘా అంతంతే..

పోలీసుల నిఘాతోపాటు బాలికలకు అవగాహన కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించడం అంతంతగానే ఉందనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా పాఠశాలలు, ప్రధాన వీధులు, గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు నిఘా మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది. ఇదే క్రమంలో బాలికల తల్లిదండ్రులు సైతం ఎవరితో ఎలా నడుచుకోవాలి..? ఎలా ఉండాలి..? పరిచయం లేని వ్యక్తులతో ఎలా మసులుకోవాలి..? ఆపద సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసు కోవాలి..? అనే విషయాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పదో తరగతి పరీక్షకు 547 మంది గైర్హాజర్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో సోమవారం నిర్వహించిన మ్యాథ్స్ పరీక్షకు 547 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 130 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 25287 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 24740 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 24 పరీక్షా కేంద్రాలను పరిశీలించామని, రాష్ట్ర అబ్జర్వర్ అబ్రహం జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామని అన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడండి

పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులు ఎలాటి పరిస్థితుల్లో పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పాల్గొన్నారు. ప్రజల నుంచి 62 వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, అత్తారింటి వేధింపులు తదితరాలపై ప్రజలు ఎస్పీకి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్, అడిషనల్ ఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగులకు పాల్పడితే చర్యలు: ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. క్రికెట్ పోటీలను వినోదం కోసం మాత్రమే చూడాలని, కుటుంబంలో విషాదం నింపేలా విధంగా ఉండకూడదన్నారు. యువకులు, అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని బెట్టింగులకు పాల్పడవద్దని అన్నారు. బెట్టింగ్‌లు నిర్వహిస్తే ఊరుకునే ప్రసక్తేలేదని ఎస్పీ హెచ్చరించారు.

చివరి ఆయకట్టుకు శాపం

- అధికారుల అవగాహన లోపమే కారణం
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



కేసీ నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొందరు కేసీ అధికారుల అవగాన లోపం, నిర్లక్ష్యం వల్ల కేసీ చివరి ఆయకట్టు రైతాంగానికి శాపంగా మారిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే సోమవారం నంద్యాల మండల పరిధిలో మీద పొన్నాపురం పరిధిలో ఉన్న కెసి లాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటిని సర్దుబాటు చేసుకుంటూ అన్ని ప్రాంతాల రైతులకు నీరివ్వాలని అధికారులకు సూచించారు. లక్ష ఎకరాలు ఉన్న ఆళ్లగడ్డ చివరి ఆయకట్టుకు నీరు రావాలంటే కేసీ కాలువలో కనీసం 5 అడుగల నీటి మట్టం ఉండాలన్న విషయం అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. సుంకేసులలో సైతం నీళ్ల లేకపోవటంతో ముచ్చుమర్రి 4వ పంపు వివిధ కారణాల వాడుకోలేని పరిస్థితి ఉం దన్నారు. ఎమ్మెల్యే వెంట ఆళ్లగడ్డ కేసీ రవీంద్ర బాబు స్థానిక అధికారులు ఉన్నారు.

పాల సేకరణ ధర పెంపు

విజయ డెయిరీ చైర్మన్



నంద్యాల రూరల్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పాల సేకరణ ధర పెంచినట్లు కర్నూలు జిల్లా మిల్క్ యూనియన్ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. కర్నూలు జిల్లా పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకర సమితి తీసుకున్న నిర్ణయం మేరకు మార్చి 16 నుంచి పాలసేకరణకు ధర పెంచినట్లు తెలిపారు. పాల సేకరణ ధరను కేజీ వెన్న (కేజీ ఫ్యాట్) ఆధారంగా గేదె పాలకు కిలో రూ.740 నుంచి రూ.760 కు పెంచామని చెప్పారు. ఆవు పాల ధరను కిలో ఒక రూపాయి చొప్పున పెంచినట్లు పేర్కొన్నారు. పెరిగిన పాల సేకరణ ధరలు కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాలో పాల రైతులందరికీ వర్తిస్తాయని వెల్లడించారు.

నీరు వదలకుంటే చావే శరణ్యం

కేసీ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



కేసీ కార్యాలయం వద్ద రైతులు

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ పరిధిలోని నూనెపల్లె సబ్ చానల్‌కు నీరు ఇవ్వకుంటే చావే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నూనెపల్లె సబ్ చానల్ పరిధిలోని పలు గ్రామాల రైతులు కేసీ కార్యాలయాన్ని ముట్టడించారు. సబ్ చానల్ పరిధిలోని రెండు వేల ఎకరాల మిర్చి పంటను కాపాడాలని నినాదాలు చేశారు. నీరివ్వకుంటే ఎకరాకు రూ.2 లక్షల పైగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. మిట్నాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శీలం నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ నూనెపల్లె సబ్ చానల్ పరిధిలో మూడు అడుగులు గేజి పెంచితే కానీ చివరి ఆయకట్టు నీరందదని అన్నారు. కోత దశలో ఉన్న పంటకు ఏప్రిల్ 15 వరకు నీరివ్వకుంటే అన్నదాతకు తీవ్ర నష్టం జరగనుందని తెలిపారు. డీసీ కాటం రెడ్డి తులసీశ్వర రెడ్డి మాట్లాడుతూ తేళ్లపురి గ్రామ పొలాలకు నీరు రావటం లేదని అన్నారు. పొన్నాపురం లాకులు దించి మూడు అడుగుల నీరు ఇస్తే తప్ప పంట చేతి కందదని తెలిపారు. తాగడానికి సైతం కుంటల్లో నీరు లేదని, పశువులు, గొర్రె మందలకు నీరు ఇవ్వలేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని ముచ్చుమర్రి లిఫ్ట్‌లో నాలుగో పంపు ద్వారా కూడా నీరిందించాలని అన్నారు. కార్యక్రమంలో గుంతనాల సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణ పనులను వంద శాతం పూర్తి చేశామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రోడ్లకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సీసీరోడ్లను 96శాతం పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. పంట నీటికుంటలు, పర్క్యులేషన్ ట్యాంక్స్, ఫిష్‌ట్యాంక్స్ తదితరవాటిని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి 203దరఖాస్తులను కలెక్టర్, జేసీ విష్ణుచరణ్, ఇతర అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంతోపాటు ఫిర్యాదుదారులనుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 30వేల అర్జీలు పరిష్కరించామని వారి నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న కలెక్టర్ రాజకుమారి

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమ వెనుకబాటుతనం

బొజ్జా దశరథరామిరెడ్డి



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

పత్తికొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పాలకులు అవలంబించిన నిర్లక్ష్యం వల్లనే రాయలసీమ వెనుకబాటుతనానికి గురైందని, ఇప్పటికైనా ప్రజలు మేల్కొని పార్టీలకతీతంగా సాగు, తాగునీరుకై ఉద్యమించాలని రాయలసీమ సాగునీటి సంఘం సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పందికోన రిజర్వాయరు 14 ఏళ్లు కావస్తున్నా కళ్లెదుటే పక్క జిల్లాలకు ఏటా కాలువ ద్వారా పారుతున్నా ఆ నీరును రైతులు వాడుకునే అవకాశం లేకపోవడం విచారకరమన్నారు. పందికోన కుడి, ఎడుమ కాలువలను పూర్తి చేస్తే 62 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, అనేక గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు అరుణ్, ఆదినారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదోని మెడికల్ కాలేజీ పనుల పరిశీలన

- మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి రూ.312 కోట్ల నిధులు
- 60 శాతం కూడా పూర్తిగాని పనులు
- ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే పూర్తి చేయాలి
- నాబార్డు ఏపీ రీజినల్ జనరల్ మేనేజరు కేవీఎస్ ప్రసాద్



పరిశీలిస్తున్న నాబార్డు జనరల్ మేనేజరు కేవీఎస్ ప్రసాద్ తదితరులు

కర్నూలు/ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని మెడికల్ కాలేజీ, ఆసుపత్రి నిర్మాణం అసంపూర్తి పనులపై నాబార్డు ఏపీ రీజినల్ మేనేజరు కేవీఎస్ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 60 శాతం కూడా పూర్తి చేయాలేదని పేర్కొన్నారు. నాబార్డు ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజరు (ఏజీఎం) ఎం సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎం.కేశవయ్యతో కలిసి సోమవారం ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పరిశీలించారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, కాలేజీ, మెడికల్ బ్లాక్, మెడిసిన్ విద్యార్థుల హాస్టళ్ల భవనాల పనులను ఆయన పరిశీలించారు. ఏఏ భవనాలు ఏ స్థాయిలో ఉన్నాయో సమగ్రంగా తనిఖీ చేయడమే కాకుండా వాటి ఫొటోలు కూడా తీసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆదోని మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణం కోసం ఆర్ఐడీఎఫ్ కింద రూ.312 కోట్లు మంజూరు చేశామని అన్నారు. అనివార్య కారణాలు వల్ల ఆగిపోయాయని తెలిపారు. నాబార్డు రూ.312 కోట్లు మంజూరు చేస్తే ఇప్పటికే రూ.141 కోట్లు విడుదల చేసిందని, కాంట్రాక్ట్ సంస్థ రూ.80 కోట్ల మేర పనులు చేసిందని వివరించారు. ఆదోని ప్రాంతం ఎంతో వెనకబడి ఉందని, ఇక్కడి ప్రజలకు మెడికల్ కాలేజీ, బోధనాస్పత్రి ఎంతో అవసరమని, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తి చేయడంతో పాటు వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మంచి టైం..!

సిటీ లైఫ్

చిన్న ఇల్లు అయినా సరే అందంగా ఉంచుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. ఇటీవలి కాలంలో ఇళ్ల నిర్మాణాలు, ఇంట్లో ఇంటీరియల్స్ డెకరేషన్స్ డిజైన్లపై ప్రజల్లో మోజు పెరుగుతోంది. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఇల్లు బంగారంలా మెరిసిపోవాలంటూ ఇంటి యజమానులు శ్రద్ధ చూపుతున్నారు. ఇంట్లో కొత్తగా అందంగా ఉండే వస్తువులను ఏర్పాటు చేసుకుంటున్నారు. కప్‌బోర్డ్స్, ఫాల్ సీలింగ్స్, మార్బుల్స్, డోర్ల డిజైన్లు వాల్ టైల్స్, పెయింటింగ్స్ ఇలా ఏ డిజైన్‌లో కూడా రాజీ పడడం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే అక్కడక్కడ అలంకరించేందుకు ప్రత్యేకించి బొమ్మలను కొనుగోలు చేస్తున్నారు. వీటితో పాటు ఈ క్రమంలో గోడ గడియారాలను కూడా ప్రత్యేకంగా ఉండే వాటిని ఎంచుకుంటున్నారు. కొందరు పెద్దవిగా, ప్లెయిన్‌గా ఉండే వాల్ క్లాక్‌లను ఇష్టపడుతుండగా.. మరికొందరు తమ హోదాను, దర్పాన్ని తెలిపేలాంటి గోడ గడియారాలపై మక్కువ చూపుతున్నారు. ఇలాంటి వారి కోసం ఆకట్టుకునే లాంటి ఇంటి అందాన్ని పెంచేటటువంటి గోడ గడియారాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. నగరంలో పెద్ద పెద్ద హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లోనూ ఇలాంటి గడియారాలు ఆకర్షిస్తున్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం..

-కర్నూలు క్రైం (ఆంధ్రజ్యోతి)

- ఆకట్టుకుంటున్న విభిన్న గోడ గడియారాలు
- పాత కాలం వాల్‌క్లాక్‌లపై మోజు
- నగరవాసుల్లో ఇంటీరియల్స్‌పై మక్కువ



● **డిజిటల్ క్లాక్:** ఎల్ఈడీ వెలుగును వెదజల్లే ఈ క్లాక్స్‌ను ఇంటికి కొత్త అందాన్నిస్తాయి. వెలుగు తక్కువ ఉండే గదుల్లో కూడా ఇవి చాలా బాగుంటాయి. ఇందులో ఉండే రేడియో అలారం ఉదయాన్నే నిద్రలేపుతుంది.



● **త్రీడీ మోడల్:** త్రీడి గడియారాల్లో బొమ్మలు, పెయింటింగ్స్, స్టిక్కర్స్ ఒక ప్యానెల్‌లో కాకుండా రెండు, మూడు ప్యానెల్స్‌లో ఉంటున్నాయి. ఒకదానిలో మాత్రం వాల్ క్లాక్ ఉంటుంది. స్పైడర్‌మెన్, జంతువులు, పండ్లు, కూరగాయల బొమ్మలున్న త్రీడీ వాల్ క్లాక్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

● **డిజైన్ గడియారాలు :** రంగు రాళ్లతో చేసిన డిజైన్ గడియారాలు వెండి లోహంతో తయారు చేసిన గడియారాలు ఇంటికి ప్రత్యేక అందాన్ని తీసుకువస్తున్నాయి. మధ్యలో గడియారం ఉండి చుట్టూ ఫ్రేమ్‌లు ఉండటం, ఇంట్లో సభ్యుల ఫొటోలు, ఫ్యామిలీ ఫొటోలు, పూలు, బొమ్మలు, కోయబొమ్మలు, అమర్చుకునే విధంగా ఈ గడియారాలు ఉంటున్నాయి. సూర్యుడు, చంద్రుడు, నెమళ్ల ఆకారాల్లో కూడా ఈ గడియారాలు మార్కెట్‌లో ఆకట్టుకుంటున్నాయి.



● **ఓల్డ్ ఈజ్ గోల్డ్ :** ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ పాత తరం నాటి గడియారాలే కొత్త ట్రెండ్‌గా నగరవాసులు ఫాలో అవుతున్నారు. పెద్ద గడియారం అడుగు నుంచి రెండు వైపులా వేలాడుతూ ఊగిసలాడే పెండ్యులమ్ నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. పెండ్యులమ్ కదలికతో వచ్చే స్వీట్ సౌండ్ ఈ మోడల్‌లో మాత్రమే ఉండే ప్రత్యేక లక్షణం కావడంతో నేటి తరం వారు ఈ గడియారాలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ గడియారాలు నగరంలోని ప్రముఖ వాచ్ దుకాణాల్లో ఆన్‌లైన్ మార్కెట్‌లో రూ.1000 నుంచి రూ.20వేల వరకు లభిస్తు న్నాయి.





● **ఎంపీ-3 అలారం క్లాక్:** ఎంపీ-3 కలిగిన డిజిటల్ అలారం గడియారాలు నవ్యత రాన్ని ఆకట్టుకుం టున్నాయి. సరిక త్తపాటలతో ఉద యాన్నే ఇవి మ నలను మేలుకొలుపుతాయి.

గోనెగండ్ల సెక్షన్‌కు వచ్చిన ఎల్లెల్సీ నీరంతా కోడుమూరుకే..

ఆయకట్టు భూములకు 79 క్యూసెక్కులు

జీడీపీ నుంచి 40, ఎల్లెల్సీ నుంచి 39 క్యూసెక్కులు

గోనెగండ్ల, మార్చి24(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి నీటి విడుదల మూడు రోజులుగా తగ్గింది. గోనెగండ్ల సెక్షన్‌కు సోమవారం 39 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతోంది. దీంతో గోనెగండ్ల సెక్షన్‌కు చేరిన 39 క్యూసెక్కుల నీటినంతటిని కోడుమూరు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు అధికారులు విడుదల చేస్తున్నారు. దీంతో గోనెగండ్ల ఆయకట్టు భూములకు నీటి విడుదలను నిలిపివేశారు. కోడుమూరుకు ఎల్లెల్సీ నుంచి విడుదలైన 39 క్యూసెక్కులు ఎంతమాత్రం సరిపోకపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి కుడి కాలువ ద్వారా మరో 40 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ఎల్లెల్సీ నీరు 39 క్యూసెక్కులు, గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 40 క్యూసెక్కుల నీరు కోడుమూరు చేరుతోంది. ఈ నీటి విడుదల మరో రెండు మూడు రోజులు కొనసాగవచ్చునని తెలుస్తోంది. గోనెగండ్ల సెక్షన్ కింద అరకొరగా మిగిలిన పంటలు కోత కోసుకోవడం కోసం మరోసారి నీటి విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. తాగునీటి కోసం కూడా నీరు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. వేసవి కాలం దృష్ట్యా గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంకులు, కుంటలు, వాగులను నీటితో నింపుకోవాల్సి ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. కొన్ని రోజులుగా సాగు నీరు కోడుమూరు సెక్షన్‌కు అందకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుతం ఎల్లెల్సీ, జీడీపీ నీరు 79 క్యూసెక్కులు విడుదల కావడంతో కోడుమూరు ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు మాత్రం మార్చి నెల చివరి వరకు ఎల్లెల్సీ నీటి విడుదల ఉంటుందని తెలుపుతున్నారు. ఈ రబీ సీజన్ లో గోనెగండ్ల సెక్షన్‌కు 175 క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉంది. అయితే సోమవారం 39 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలైంది.



గాజులదిన్నె ప్రాజెక్టు కుడి కాలువ నుంచి కోడుమూరుకు వెళుతున్న నీరు

రుణాల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్



బెల్డోన గ్రామంలో రైతు నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్న బ్యాంకు అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా సహకార బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక, కర్షక జ్యోతి పథకం కింద రుణాలు తీసుకున్న రైతుల నుంచి బకాయిల వసూలు కోసం బ్యాంకు అధికారులు స్పెషల్ డ్రైవ్ సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్‌తో పాటు జనరల్ మేనేజర్ రామాంజనేయులు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, నాగిరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్ రెడ్డి, తదితరులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రుణాలను రికవరీ చేస్తున్నారు. ఇందులో భాగంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, ఏజీఎం త్రినాథ్ రెడ్డి తదితరులు సోమవారం ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలంలోని బెల్డోన గ్రామంలో నాగముని రుద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఖాజామొహిద్దీన్ తదితర రైతుల నుంచి రుణబకాయిలు సకాలంలో జమ కానందున వారి సమక్షంలో టీవీలను, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో విలేకరుల సమావేశంలో డీజీఎం ఉమామహేశ్వరరెడ్డ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో దీర్ఘకాలిక రుణాలు, కర్షక జ్యోతి పథకం కింద రైతుల నుంచి రూ.350 కోట్ల దాకా రుణబకాయిలు వసూళ్లు కావాల్సి ఉందని స్పష్టం చేశారు. 2,500 మంది రైతులు పది సంవత్సరాలుగా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం లేదని, ప్రస్తుతం వారికి చెందిన చరాస్తులను మాత్రమే జప్తు చేస్తున్నామనీ, త్వరలోనే స్థిరాస్తులను కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు.

శ్రీమఠం కృషి అభినందనీయం

కొనియాడిన మఠాధిపతులు

మంత్రాలయం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): దేశానికి ఎంతో మంది వేద విద్వాంసులను శ్రీమఠం వేద పాఠశాల అందిస్తోందని పలువురు మఠాధిపతులు అన్నారు. సోమవారం శ్రీమఠం ఊంజల మండపంలో ఏర్పాటు చేసిన శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి ఆయా మఠాల పీఠాధిపతులు వేరువేరుగా సంస్థాన పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం వ్యాసరాజ మఠం, శ్రీపాద రాజమఠం, పేజావర్ మఠం, మళిమార్ మఠం, భీమనకట్టె మఠం పీఠాధిపతులు విద్యేశీష తీర్థులు, సుజయనిధి తీర్థులు, విశ్వప్రసన్న తీర్థులు, విద్యాధీష తీర్థులు, విశ్వధీష తీర్థులు మాట్లాడారు. మంత్రాలయం శ్రీగురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలో అత్యంత ప్రాముఖ్యమైన శ్రీమన్ న్యాయసుధ విద్యను పూర్తి చేయించి దేశానికి అవసరమైన పండితులను అందించిందన్నారు. రాఘవేంద్ర స్వామి మఠం దినదినాభివృద్ధితో పాటు గోసంరక్షణ, ఉచిత వైద్యం, సంస్కృత విద్య, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో సఫలీకృతమైందని కొనియాడారు. అనంతరం మఠాధిపతులను సత్కరించారు. కార్యక్రమంలో రాజాఎస్ గిరిరాజాచార్, రాజాఎస్ అప్రమేయ ఆచార్, బండాచార్, ఎస్ఎన్ వెంకటేష్ ఆచార్, సుధీంద్ర ఆచార్, ఆనందతీర్థఆచార్, గౌతమాచార్, సురీంద్రాచర్, వాదిరాజాచార్, రమనారావ్, ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్‌జోషి, శ్రీపతిఆచార్, సురేష్‌కోణాపూర్, ఐపీ నరసింహమూర్తి, ఏఈ బద్రినాథ్, వ్యాసరాజాచార్, వివిధ రాష్ట్రాల పండితులు, భజన మండలి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవానికి హారతులు ఇచ్చి ముగింపు పలుకుతున్న పీఠాధిపతులు



వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన విద్వాంసులు, పండితులు

అడవిలో అన్నదాతలు

- ప్రతిరోజూ వేలాది మంది భక్తుల ఆకలి తీరుస్తున్న వైనం
- 20 ఏళ్లుగా శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్టు సేవలు



ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రానికి తరలివెళ్లే కన్నడిగులకు దాతల సేవలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా ఇచ్చిలుకరించి ప్రాంతానికి చెందిన శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని నాగలూటి వీరభద్రస్వామి ఆలయ సమీపంలో 20 ఏళ్ల నుంచి వేలాది మంది కన్నడిగుల ఆకలి తీరుస్తున్నారు. ఈ అన్నదాన సేవకై ప్రతిఏటా సుమారు రూ.కోటి వరకు వరకు ఖర్చు కానుంది. ఇందులో 20 శాతం వరకు దాతల నుంచి విరాళాలు అందుతున్నప్పటికీ మిగిలిన 80 శాతం ఖర్చులను ట్రస్టు సభ్యులే భరాయిస్తున్నారు. ఉగాది మహోత్సవాల నేపథ్యంలో శ్రీశైలానికి కాలినడకన తరలివచ్చే భక్తులకు ఎలాంటి లోటు రాని వ్వకూడదన్నదే తమ సంకల్పమని ట్రస్టు సభ్యులు చెబుతున్నారు.

250 మంది వలంటీర్లతో నిరంతర సేవలు

శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు ఆధ్వర్యంలో నాగలూటి వీరభద్రాలయం సమీపంలో కొనసాగుతున్న అన్నదాన కేంద్రంలో సుమారు 250 మంది కూలీలు అన్నదాన సేవలో భాగస్వాములయ్యారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొంత మంది భక్తులు ముందుగానే వందల కి.మీ. దూరం కాలినడకన నాగలూటి చేరుకుని అక్కడి అన్నదాన కేంద్రంలో కొన్ని రోజులు సేవలు చేసి శ్రీశైలానికి వెళ్తుంటారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు నిరంతరం వలంటరీలు ఎవరి పనులు వారు చేస్తుంటారు. అన్నం, సాంబార్, మజ్జిగ, పాయసం తదితర ఆహార పదార్థాలతో పాటు జొన్న రొట్టెలను తయారీ చేసి భక్తులకు వడ్డిస్తున్నారు. వారం రోజులకు సరిపడేలా 50 టన్నుల బియ్యం, క్వింటాళ్ల కొద్ది బెల్లం, నూనె తదితర నిత్యావసర వస్తువులను నిల్వ ఉంచారు. ఆత్మకూరు సంత మార్కెట్ నుంచి ప్రతిరోజూ కూరగాయాలు కొనుగోలు చేస్తున్నారు. ఇదిలావుంటే శ్రీశైల పాదయాత్రికులకు అన్నదాన సేవలు ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు ఆధ్వర్యంలో నల్లమల చెంచులకు సేవలు అందిస్తున్నారు. అన్నదాన నిర్వహణ అనంతరం మిగిలిన సామగ్రిని స్థానిక చెంచులకు పంపిణీ చేస్తారు. అలాగే ప్రతిఏటా దుస్తులను కూడా అందజేస్తారు.



భారీ వంట పాత్రలో పాయసాన్ని తయారు చేస్తున్న దృశ్యం



జొన్నరొట్టెలను తయారు చేస్తున్న మహిళలు

20 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నాం

25 ఏళ్ల కిందట శ్రీశైలానికి కాలినడకన వచ్చాను. అప్పట్లో ఆకలికి తట్టుకోలేక అల్లాడిపోయాం. మేము పడ్డ కష్టాలు శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదని భావించాం. దాతల సహకారం, మా ట్రస్టీ సహకారంతో 20 ఏళ్లుగా నాగలూటిలో అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజూ వేలాది మంది భక్తులకు ఆకలి తీరుస్తున్నాం. శ్రీశైల దేవస్థానం సహకరిస్తే భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.



- పాటిల్, శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు చైర్మన్, మహారాష్ట్ర

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

- కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్



కర్నూలు న్యూసిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మిక శాఖ రాయలసీమ జోనల్ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్ అన్నారు. సోమవారం ధర్మపేట కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల రక్షణకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పని ప్రాంతాల్లో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని, అత్యవసర మందులు అదించాలని అన్నారు. డీహైడ్రేషన్ నివారణ మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు.

వేలంలో రూ.1.68 కోట్లు ఆదాయం

మహానంది, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో సోమవారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏడాది పాటు మహానందికి వచ్చే భక్తుల వాహనాల నుంచి రెండు టోల్ గేట్ల ద్వారా వసూలు చేసే టెండరును తిమ్మాపురానికి చెందిన నాగభూపాల్‌రెడ్డి రూ.1.68 కోట్లకు సీల్‌టెండర్ ద్వారా దక్కించుకున్నారని చెప్పారు. అలాగే ఆలయం ముందు భాగంలోని ఎనిమిది ఖాళీ స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకునేందుకు బహిరంగ వేలాలు నిర్వహించామని తెలిపారు. భక్తుల పాదరక్షలు, మరుగుదొడ్ల నిర్వహణ హక్కుకు దేవస్థానం నిర్ణయించిన పాటకు టెండర్‌దారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని ఈవో చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ యర్రమల్ల మధు, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌శెట్టి, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది నీలకంఠరాజు, మల్లిఖార్జున, పసుపుల సుబ్బారెడ్డి, నాగమల్లయ్యలు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ..

- పరీక్ష రాసిన విద్యార్థిని



విద్యార్థిని మమత

క్రిష్ణగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థిని పరీక్ష రాసింది. క్రిష్ణగిరి గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి(40) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించాడు. తండ్రి మృతి చెందిన బాధను దిగమింగుకొని కూతురు మమత సోమవారం జరిగిన పరీక్షకు హాజరైంది. అనంతరం జరిగిన తండ్రి అంత్యక్రియలలో పాల్గొంది.

గూడ్స్‌రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని- కోసిగి స్టేషన్ల మధ్య కేఎం నెంబరు 523/33-31 అప్‌లైన్ ట్రాక్ వద్ద గూడ్స్ రైలు ఢీకొని తలారి ఈరన్న (60) మృతి చెందినట్లు ఆదోని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సై గోపాల్ తెలిపారు. కోసిగా మండలం జుమ్మాలదిన్నె గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన తలారి వీరన్న రైల్వే పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ వెల్లడించారు.

అన్నపై తమ్ముడి దాడి.. కేసు నమోదు

గోనెగండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో అన్న చాకలి క్రిష్టపై తమ్ముడు చాకిలి ఈరన్న రాళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు సీఐ విజభాస్కర్ తెలిపారు. చాకలి క్రిష్ట, చాకలి ఈరన్న అన్నదమ్ములు. వీరికి గంజహళ్లి క్రాస్ రోడ్డులో మూడు సెట్ల స్థలం ఉంది. స్థలం విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. అయితే సోమవారం స్థలం దగ్గరకు చాకలి క్రిష్ట వచ్చాడు. దీంతో అన్నదమ్ముల మధ్య ఘర్షణ ఏర్పడి వాదోపవాదాలు జరిగాయి. వాదనలు కాస్తా తీవ్ర స్థాయికి చేరడంతో ఈరన్న ఆగ్రహానికి లోనై క్రిష్టపై రాళ్లతో దాడి చేశాడు. దీంతో క్రిష్ట తలకు గాయమైంది. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు క్రిష్ట ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ జావలి

నంద్యాల క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న బండిఆత్మకూరు మండలం జీసీపాలెం-నారాయణపురం గ్రామాల మధ్య బొగ్గులకాల్వ అలుగు వంక వద్ద నంద్యాల సుధాకర్‌రెడ్డి హత్య ఘటనలో నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ తెలిపారు. ఈ మేరకు నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె నిందితుల వివరాలను వెల్లడించారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన గుర్రాల రామస్వామి, గుర్రాల శివన్న అలియాస్ శివ అలియాస్ యెహోషువ, గుర్రాల తిరుపాలు, గుర్రాల లక్ష్మన్న అలియాస్ లక్ష్మణ్‌లను బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామ సమీపంలో గల ఏకశిల అభయాంజనేయస్వామి గుడి దగ్గర అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులంతా తండ్రీ కొడుకులని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో సీఐ శ్రీనివాసులురెడ్డి, బండిఆత్మకూరు ఎస్సై జగన్‌మోహన్, మహానంది ఎస్సై రామ్మోహన్‌రెడ్డి, సిబ్బందిని అభినందించి రివార్డులకు సిఫార్సు చేసినట్లు ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ తెలిపారు.

ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న గ్రామస్థులు

పెద్దకడబూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకడోణ గ్రామ సమీపంలోని ఎల్లెల్సీలోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రహిమాన్ పని నిమిత్తం ట్రాక్టర్‌ను పెద్దతుంబళం వైపు తీసుకెళ్తుండగా వెనుకకు తిప్పే సమయంలో పక్కనే ఉన్న ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ రహిమాన్ ట్రాక్టర్ నుంచి బయటకు దూకివేశాడు. దీంతో డ్రైవర్‌కు ప్రమాదం జరగలేదు. అంతేగాక పక్కనే బట్టలు ఉతుకుతున్న మహిళల పక్క నుంచి ట్రాక్టర్ దూసుకెళ్లింది. అయితే మహిళలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. కాలువలో పడిన ట్రాక్టర్‌ను గ్రామస్థులు బయటకు తీశారు.

కర్నూలు ప్రగతి అజెండా..!

స్మార్ట్‌సిటీగా కర్నూలు

ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత సీఎం చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌లు కర్నూలు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. నిధులు, ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



హెడ్ స్లూయిస్ పనులతో ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ

- స్మార్ట్ సిటీగా కర్నూలును అభివృద్ధి చేయాలి
- వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక
- ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులతో కరువు నివారణ
- గుండ్రేవులపై దృష్టి సారించాలి
- వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీటి సమస్యకు చెక్
- నేడు, రేపు కలెక్టర్ల సదస్సు
- అమరావతికి బయలుదేరిన కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు రేపు, ఎల్లుండి నిర్వహించనుంది. రాబోయే ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో కీలకమైన ఐదు అంశాలు కర్నూలు ప్రగతి అజెండాగా కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అమరావతికి బయలుదేరారు. స్మార్ట్ సిటీగా కర్నూలు, వలసలు నివారణ, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సమస్యలు, కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు నేషనల్ హైవే రోడ్డు.. వంటి కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు.

2019 జనవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన వేవతి ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలి. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు లక్ష్యంగా వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి 2019 జవనరిలో రూ.1,942.38 కోట్లు మంజూరు చేస్తూ జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేశారు. టెండర్ల పూర్తి చేసి పనులు కూడా మొదలు పెట్టారు. సుమారుగా రూ.90 కోట్లు ఖర్చు చేశారు. అలాగే. మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోనే అత్యధికంగా వలసలు ఉన్నాయి. శాశ్వత పరిష్కారం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి 2019 జనవరిలో జీవో ఆర్టీ నం.76 జారీ చేసి రూ.1,985.42 కోట్లు మంజూరు చేశారు. ఆర్డీఎస్ అనకట్ట దగ్గర హెడ్ స్లూయిస్ పనులు, కాలువ నిర్మాణం మొదలు పెట్టి 0.06 శాతం పనులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు అటకెక్కాయి. రాయలసీమ జిల్లాల జీవనాడి గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లా సమగ్ర అభివృద్ధే ప్రధాన అజెండా



జిల్లా కలెక్టర్ల సదస్సులో ఏ ఏ అంశాలపై హాజరు కావాలో సీఎంవో నుంచి వచ్చిన ఫార్మెట్ ప్రకారం జిల్లా సమగ్ర అభివృద్ధిపై నివేదిక తయారు చేశాం. ఐదు ప్రధాన అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లబోతున్నాం. అవకాశం ఉంటే ఇతర అంశాలపై కూడా చర్చిస్తాను. - పి.రంజిత్‌బాషా, కలెక్టర్, కర్నూలు

పశ్చిమ ప్రాంతంలో కేజీబీవీ స్కూళ్లు పెంచాలి

జిల్లా పశ్చిమ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలసి స్కూళ్లలో చదువుకుంటున్న పిల్లలు కూడా వలస వెళ్లుతున్నారు. దీంతోవాళ్ల చదువు ఆగిపోతోంది. జిల్లాలో 26 కేజీవీబీ పాఠశాలు ఉన్నాయి. వాటి సంఖ్యను రెట్టింపు చేయాల్సి ఉంది.

కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు జాతీయ రహదారి

జిల్లాలో ఏకైక ప్రధాన రహదారి కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు రోడ్డు, ఆలూరు, కోడుమూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలు జిల్లా కేంద్రం కర్నూలుకు చేరుకోవాలంటే ఏకైక రహదారి. ఏళ్లు గడుస్తున్నా విస్తరణకు నోచుకోవడం లేదు. నేడు కలెక్టర్ల సదస్సులో ఈ రహదారి అభివృద్ధిపై కలెక్టర్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నారు.

దాహం తీరాలంటే 'వాటర్ గ్రిడ్' శరణ్యం

జిల్లాలో ఇప్పటికీ 1,16,264 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు లేవు. గాజుల దిన్నె, పులికనుమ, హంద్రీనీవా పత్తికొండ, గోరుకల్లు జలాశయాల నుంచి శుద్ధి చేసిన సురక్షిత తాగునీరు పైపులైన్ల ద్వారా 1.7707 టీఎంసీలు సరఫరా చేసి అందించేందుకు రూ.3,343.80 కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రతిపాదన తయారు చేశారు. వాటర్‌గ్రిడ్‌ను సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లనున్నారు.



ఆస్పరి మండలంలో తాగునీటి సమస్యకు నిదర్శనం

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్విమానుపల్లెలో తీవ్ర విషాదం నెలకొంది. ఇంటి వద్ద తాగునీరు పట్టుకోవడానికి మోటార్ ప్లగ్ పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి విద్యార్థి ఆవుల విరాట్ యాదవ్(13) మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆవుల బ్రహ్మయ్య కుమారుడు విరాట్ గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం నీళ్లు పట్టుకోవడానికి మోటార్ వేసే సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన విరాట్ యాదవ్‌ను స్థానిక వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం వెల్లడించారు.

డీలర్‌తో పాటు 14 మందిపై కేసు

రుద్రవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామ సమీపంలోని ఆవుల నాగమ్మ మామిడి తోటలో సోమవారం పేకాట స్థావరాలపై దాడి చేసినట్లు ఏఎస్ఐ భూపాల్ రెడ్డి తెలిపారు. ఈ దాడిలో రుద్రవరం గ్రామానికి చెందిన చౌక దుకాణం డీలరుతో పాటు 14 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఎనిమిది మందిని అరెస్టు చేయగా మరో ఏడుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు.

పంజాబ్‌లో ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య

- మృతుడు ప్యాపిలి మండల వాసి

ప్యాపిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఐఐటీ విద్యార్థి రెండు రోజుల క్రితం పంజాబ్ రాష్ట్రంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి మృతదేహాన్ని సోమవారం సొంత ఊరుకు తీసుకొచ్చారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. మండలంలోని ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సుధాకర్, సుధారాణి దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్(23) పంజాబ్ రాష్ట్రంలోని రూపర్ ఐఐటీ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు.

మూడో సంవత్సరంలో ఒక సబ్జెక్టు విద్యార్థి ఫెయిలయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన అరుణ్‌కుమార్ క్యాంపస్‌లోని తన గదిలో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అరుణ్‌కుమార్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన వర్ణణాతీతంగా మారింది.

గ్రామీణ అభివృద్ధే జాతీయ సదస్సు లక్ష్యం



సిల్వర్‌జూబ్లీ కళాశాలలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధికి జాతీయ సదస్సు ఉపయోగపడుతుందని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా క్లస్టర్‌తో పాటు, రాయలసీమ యూనివర్సిటీల రిజిస్ట్రార్ పి. విజయకుమార్ నాయుడు హాజరయ్యారు. వివిధ ప్రదేశాల నుంచి పత్ర సమర్పణ చేయడానికి 130 మంది అందించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చేపట్టిన స్కీంలను వివరంగా తెలిపారు. ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి, ఎల్లా కృష్ణ, డాక్టర్ అక్తర్‌బాను, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం సబ్సిడీపై డిప్పు

- ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్రిప్పు పరికరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల రైతులకు వంద శాతం సబ్సిడీ ఇస్తోందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో 90 శాతం ఉన్న సబ్సిడీని కూటమి ప్రభుత్వం ఐదెకరాల్లోపు పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీతో పరికరాలను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 5 నుంచి 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు గతంలో 70 శాతం సబ్సిడీ ఉండేదని, ఇప్పుడు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. జీవో నెం.82 ప్రకారం అర్హులైన రైతులందరికీ కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటి దాకా కర్నూలు జిల్లాలో 30,872 మంది డ్రిప్పుతోపాటు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకున్న రైతులు ఉన్నారని, 34,132 హెక్టార్లలో డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఆస్పరి, దేవనకొండ, కల్లూరు, క్రిష్ణగిరి, మంత్రాలయం, తుగ్గలి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర, కర్నూలు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని ప్రాంతాల్లో డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో రైతులు తక్కువ నీటితోనే పంటలు సాగు చేస్తున్నారని, మిగిలిన రైతులు కూడా డ్రిప్పు పరికరాల కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలను నమోదు చేయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఎండుతున్నది

- నదీతీర గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- భక్తులకు తుంగభద్ర నీరు కరువు



మంత్రాలయం వద్ద తుంగభద్రలో నిలిచిన నీరు

మంత్రాలయం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది ప్రవాహం ఆగిపోయింది. దీంతో నదీతీర గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తాగునీటి పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని జనాలు ఆందోళన చెందుతున్నారు.

నదీతీర గ్రామాలైన మంత్రాలయం, కోసిగి, కౌతాళం, నందవరం, సి.బెళగల్ మండలాల పరిస్థితి తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తాగునీటి పథకాలు, పంపుసెట్లకు ఇప్పటికే దాదాపు అందడం లేదు. అధికారులు ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేపట్టకపోతే ప్రజలు దాహంతో అల్లాడించే పరిస్థితి ఉంది. నదీతీర గ్రామాల్లోని సూగూరు, దిబ్బనదొడ్డి ఎస్ఎస్ ట్యాంకుల ద్వారా ఐదు మీటర్ల మేర నీటిని నిల్వ ఉంచారు. 14 గ్రామాలకు అధికారులు అందిస్తామని చెబుతున్నా ఆరు గ్రామాలకు మించి అందడం లేదు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, శ్రీమఠం అధికారులు స్పందించి తుంగభద్ర డ్యాం అధికారులతో మాట్లాడి తాగునీటి కోసం నీటిని విడుదల చేయించాలని కోరుతున్నారు

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



భక్తులకు ఇబ్బందులు లేకుండా మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేశాం. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు డ్యాం అధికారులతో మాట్లాడి నీరు అందించే ప్రయత్నాలు చేస్తాం. షవర్ల ద్వారా స్నానాల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - ఎల్.మాధవశెట్టి, రిటైర్డు రీజనల్ జాయింట్ కమిషనర్, ఏఏఈవో శ్రీమఠం

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం



తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. వారం క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ నదీతీరాన్ని పరిశీలించారు. బోర్లకు మరమ్మతులు చేయించి గ్రామాలకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. నీరు అందుబాటులో లేని గ్రామాలకు ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నాం. - వెంకట్రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, మంత్రాలయం

సమస్యలు పరిష్కరించాలని దర్నా



పగిడ్యాలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలములోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు పక్కీరుసాహెబ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. పలు గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక శవాలను కేసీ కాలువ గట్టు వెంట పూడ్చాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దళిత వాడల అబివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శివరాముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, ఉసేనమ్మ, బీరమ్మ, రాదిక, మాధవి తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యకాస జిల్లా కార్యదర్శి డేవిడ్ కోరారు. సోమవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలి ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ పద్మావతమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రుడు, రాజు, సుబ్బరాయుడు, ఏసేబు, చంద్రబాబు, రతనమయ్య, ఓబులపతి పాల్గొన్నారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు దంత పరిశుభ్రతపై వివరిస్తున్న దంతవైద్యులు డాక్టర్ మురళీధర్

నందికొట్కూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దంత సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు రోజుకు రెండు సార్లు బ్రెష్ చేసుకోవాలని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రి దంతవైద్యులు డా.కె.వి. మురళీధర్ తెలిపారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని హాజీ నగర్‌లోని ప్రాథకమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 20 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నోరు పరిశుభ్రంగా ఉంటే మన శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

మిడుతూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని మాసపేట మజర గ్రామమైన ఉప్పలదడియ గ్రామ సరిహద్దులో ఉన్న వివాదస్పంగా ఉన్న స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు ఎస్ఐ ఓబులేసు సోమవారం పరిశీలించారు. రైతులకు, చర్చికి సంబంధించిన స్థలం సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యను పరిస్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఈయన వెంట వీఆర్‌వో సంజీవరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం

పాములపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు తుమ్మలూరు గ్రామంలో మూడు రోజుల పాటు పోషన్ భీ పఢై భీ పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో కోటేశ్వరమ్మ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 0-3 సంలు వయస్సు గల చిన్నారులకు ప్రారంభ ఉద్దీపన, దివ్యాంగ పిల్లలు 3-6 సంలు కల్గిన వారికి బాల్య సంరక్షణ, విద్యను పోత్సహించడం, ఈసీసీఈ పాఠ్యంశాలు, విద్యా బోధన, విధానాలు, ప్రాథమిక అవగాహనతో అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాలను అభివృద్ధి తదతర అంశాలపై శిక్షణ ఇచ్చారు కార్యక్రమంలో వేంపెంట. పాములపాడు సెక్టార్ల సూపర్వైజర్లు, వెంకటేశ్వరమ్మ, లలితప్రభావతి పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో నీటి సామర్థ్యాన్ని పెంచాలి

నంద్యాల రూరల్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కేసీ కెనాల్‌కు నీటి ప్రవాహాన్ని పెంచాలని ఆంధ్ర ప్రదేశ్ రైతుం సంఘం డిమాండ్ చేసింది. శనివారం ఆ సంఘం నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి చేశారు. కేసీలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడం వల్ల చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో నంద్యాల, ఆళ్లగడ్డ రైతుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి నీటి ప్రవహాన్ని పెంచాలని కోరారు.

మహానంది,బాలకృష్ణ- 8639967804

బహిరంగ వేలాల ద్వారా రూ.1.68 కోట్ల ఆదాయం



మహానందిలో బహిరంగ వేలాలు నిర్వహిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో సోమవారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏడాది పాటు మహానందికి వచ్చే భక్తుల వాహనాల నుంచి రెండు టోల్‌గేట్ల ద్వారా వసూలు చేసే టెండరును తిమ్మాపురానికి చెందిన నాగభూపాల్‌రెడ్డి రూ.1.68 కోట్లకు సీల్‌టెండర్ ద్వారా దక్కించుకున్నారని చెప్పారు. అలాగే ఆలయం ముందు భాగంలోని ఎనిమిది ఖాళీ స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకునేందుకు బహిరంగ వేలాలు నిర్వహించామని తెలిపారు. భక్తుల పాదరక్షలు, మరుగుదొడ్ల నిర్వహణ హక్కుకు దేవస్థానం నిర్ణయించిన పాటకు టెండర్‌దారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని ఈ వో చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ యర్రమల్ల మధు, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌శెట్టి, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది నీలకంఠరాజు, మల్లిఖార్జున, పసుపుల సుబ్బారెడ్డి, నాగమల్లయ్య పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేద్దాం

- సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను అధికారులు సమిష్టి కృషితో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని తర్తూరు దేవాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్యకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రాముఖ్యత కల్గిన జాతర సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో గోపికృష్ణకు ఆదేశించారు. ముందుగా అజెండా లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని పంచాయతీ కార్యదర్శి, దేవాలయ ఈవోపై మండిపడ్డారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వచ్చే సమయంలో భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పనిచేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు సక్రమంగా పనిచేస్తే తాగునీటికి ఇబ్బంది ఉండదని అన్నారు. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులు చెబితే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అధికారులతో చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ,, నందికొట్కూరు సీఐ సుబ్రహ్మణ్యం, అబ్కారీసీఐ రామాంజనేయులు, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, పీఆర్‌ఏఈ బషీర్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, సురేంద్రనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, హనుమంత్‌రెడ్డి, రవికాంత్, దొరబాబురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి , దేవసహాయం పాల్గొన్నారు.

- సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

మండలంలోని మండ్లెం గ్రామంలో సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కృష్ణవేణమ్మకు రూ. 1.62లక్షలు, వెంకటేశ్వర్లుకు రూ. 30వేల చెక్కులను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. చెక్కులను తమ ఆరోగ్యాలకోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మోహన్‌రెడ్డి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంచుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఐవో రాష్ట్ర అధ్యక్షులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి సత్ప్రవర్తనతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అమీర్ అహ్మద్ సూచించారు. సంస్థాగత పర్యటనలో భాగంగా వారు నంద్యాలకు చేరుకుని ఎస్ఐఓ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో పాల్గొన్న అనంతరం పలు పుస్తకాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ యాప్‌లకు బలైపోతున్నారని, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐవో నాయకులు అబ్దుల్‌సమద్, జక్రియా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

నంద్యాల రూరల్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలు, హిందువులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. సుమారు 300 కుటుంబాలకు తోఫా అందజేశారు. ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ బాబుల్లా మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని నిరుపేద హిందూ, ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు చీరెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ పంపిణీని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎ గఫూర్, కుదుస్, హసేన్ బాష, కమాల్ నదీమ్, రఫీ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సున్నిపెంట భూఆక్రమణపై విచారణ



భూఆక్రమణలపై విచారణ చేస్తున్న అధికారులు

సున్నిపెంట, మార్చి24 (ఆంధ్రజ్యోతి): సున్నిపెంట గ్రామంలో భూ ఆక్రమణపై సోమవారం నుంచి విచారణ చేట్టారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి భవనాలను నిర్మించారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన 27 చోట్ల సోమవారం నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సున్నిపెంటలోని పలు ప్రాంతాలలో అధికారులు భవన నిర్మాణలకు కొలతలు వేశా రు. ఈ విచారణ ఈనెల 26 వరకు కొనసాగుతుదని, 27న ఆర్డీవో సమగ్ర విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తారని అధికారులు తెలిపారు. విచారణలో మండల పరిషత్ అధికారి కే.వి సుబ్రహ్మణ్యం,ఈ ఓఆర్‌డీ బాలునాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు,ఆర్‌ఐ యుగంధర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈలు తంగరాజు,హసేన్, సర్వే అండ్ ల్యాడ్ రికార్డుడిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రపాల్ పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదలచేసి రిజర్వేషన్ అమలుపరచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నంద్యాల నూనెపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మాదిగలకు సమన్యాయం జరగలేదని ఎస్సీ జనాభా కులాలవారీగా గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదలచేసి రిజర్వేషన్ అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ప్రకారం 2011జనాభా ప్రాతిపదికన ఏబీసీ గ్రూపులుగా చేస్తూ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో మాదిగలకు సమన్యాయం జరగలేదని గుర్తుచేశారు. అన్ని విధాలుగా మాదిగలకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, మంత్రివర్గ ఉప సంఘం మరోసారి క్షుణ్ణంగా కమిషన్ నివేదికను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా సహస్రదీపాలంకరణ సేవ



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు.

- శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన రమాదేవి డ్యాన్సు ఇనిస్ట్యూట్ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శివ గీతాలకు మం జరి, శిశిర, సహస్ర, హిమబిందు, సోజన్య, జస్విత, వర్షిణి, కీర్తిక, సుదీక్ష, భువన తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

ఆప్కాస్ రద్దు చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేస్తే ఆందోళనలు రద్దు చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగరాజు, ప్రసాద్, గొడుగు రాజు, సువర్ణమ్మలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో సమావేశంలో వారు మాట్లాడారు. ఆప్కాస్‌లో లక్షలాది మంది కార్మికులు ఉన్నారని అన్నారు. అయితే కార్మికుల ఉద్యోగ భద్రత దెబ్బతీసేలా ఆప్కాస్ రద్దు చేస్తే సహించేది లేదన్నారు. ఆప్కాస్ కాకుండా దళారీ వ్యవస్థలకు ఇవ్వడం వల్ల కార్మికులు దోపిడికి గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జయన్న, వినోద్, సురేష్, రాజేంద్ర, నాగన్న, మరియమ్మ, మేరమ్మ, కుమారీ ఉన్నారు.

ఆస్తి పన్ను పెంపుదలను నిలిపివేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాల పరిధిలో ఆస్తి పన్ను పెంపుదలను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర, రామ్‌నాయక్, ఇస్మాయిల్, వీరన్నలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం నగరాలు, పట్టణల్లో ఆస్తి పన్ను ముగింపు విధానాన్ని మార్చుతూ మున్సిపల్ కార్పొరేషన్ చట్టాలను సవరణ చేసి ఆర్డినెన్స్ 16/2020ని విడుదల చేసిందని అన్నారు. దీంతో అప్పటి వరకు ఉన్న ఆస్తి పన్ను ముదింపు చేసే విధానాన్ని మార్చుతూ క్యాపిటల్ విలువైన ఆస్తి పన్ను ముదింపు చేసే విధానాన్ని ఈ చట్టం తీసుకొచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 0.25శాతం అదనపు అప్పుకు అనుమతి కోసం ఈ చట్ట సవరణ చేశారని అన్నారు. కేవలం అప్పు కోసం ప్రజలపై ఆర్థిక భారం వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఏప్రిల్ 1 నుంచి 15శాతం పెంపు లేకుండా ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

గోదాదేవీ అమ్మవారికి సామూహిక అర్చనలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో వెలసిన భూవరాహి సహిత, పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం గోదాదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో సుప్రభాతసేవా, ఆరాధన, నివేధన, గోష్టి, చతుఃస్థానార్చన, హోమాలు, శాత్తుమొర్రై, తీర్థ ప్రసాద గోష్టి వంటి క్రతువులను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టు బోర్డు ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు రామయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమాజంలో క్షయవ్యాధిని రూపుమాపుదాం

ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని సమాజం నుంచి రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వం ఎంతగానో పాటుపడుతుందని అన్నారు. ఇందుకోసం ప్రత్యేకించి స్వచ్ఛంద సంస్థల ద్వారా కూడా క్షయవ్యాధి గ్రస్థులకు వ్యాధి నయమయ్యేందుకు ఎంతో నిధులను ఖర్చుచేస్తుందని తెలిపారు. పలు వైద్యకేంద్రాలలో గళ్లపరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణను ఉచితంగా తెలియజేస్తున్నారని ఈ విషయం పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. అంతకుముందు క్షయవ్యాధిని గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ రాబర్డ్ కాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

- ఆత్మకూరు పట్టణంలోని సామాజిక వైద్య కేంద్రం నందు సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు మాట్లాడుతూ.. తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లయితే క్షయవ్యాధి రాకుండా నివారించవచ్చునని అన్నారు. అలాగే క్షయవ్యాధి నిర్ధారణ అయినప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. వైద్యులు సూచనలు పాటించి క్రమంగా మందులను వాడినట్లయితే వ్యాధి నయమవుతోందని అన్నారు. అనంతరం యవ్యాధిని గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ రాబర్డ్ కాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దీపానాగవేణి, జమాలుద్దిన్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, రవికుమార్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి

పాణ్యం: మండలంలోని శాంతిరాం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షయ రోగులకు పార్మశీ విద్యార్థులు టీబీ వ్యాధినుంచి ఎలా బయటపడాలి, రోగనిరోధక శక్తి ఎలా పెంచుకోవాలో వివరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ ఎల్లాసుబ్బయ్య, అ ద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని ,ఈ వ్యాధిపై ఎలాంటి భయాందోళన అవసరం లేదని, క్షయ వ్యాధిని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని బైర్లూటి గూడెంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధిపై అవ గాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిని రూపుమాపుదామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో.ల్యాబ్ టెక్నిషియన్ సోమేశ్వరి,స్టాఫ్ నర్స్ షఫివున్నిసా,గిరిజన విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానంది: క్షయ వ్యాధి అంతానికి అందరితో కలసి పని చేస్తామని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేసారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని మహానంది మండలం ఎం.తిమ్మాపురంలో వైద్యాధికారి భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామం వీధుల్లో ప్లెక్సీ పట్టుకొని సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఉసేన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడ: పాములపాడులో ప్రపంచ క్షయ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ వైద్యశాల వద్ద డాక్టర్ గులాబ్బా, వైద్య సిబ్బంది టిబిని నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, పిహెచ్‌వో అన్నమ్మ, సూపర్వైజర్ మద్దయ్య స్థానిక కెజివిబి పాఠశాలలో విద్యార్థినిలకు టీబీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.





మహానంది మండలం తిమ్మాపురంలో, పాములపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



క్షయ రోగులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం


పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి

చాగలమర్రి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యశాఖ జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముత్యాలపాడు, డి.వనిపెంట, చెంచుగూడెం, కొత్తపల్లె గ్రామాల్లో జరుగుతున్న 104 సేవలు, ఎల్‌సీడీ సీడీ సర్వేను పరిశీలించారు. సర్వే పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు, మందులు సక్రమంగా అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌సీడీ సీడీ సర్వేను వేగవంతం చేసి ఈనెల చివరిలోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటంతోనే వర్గీకరణ సాధ్యమైంది


మంద కృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

కొలిమిగుండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పోరాటంతోనే వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు ఇరికమాను నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక దండోరా కార్యాలయం వద్ద మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగ జాతి కోసం సర్వస్వం ధార పోసిన మహనీయుడు మంద కృష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు కంబడిరి రాముడు, రామచంద్రుడు, బాల ఓబులేషు, పెద్ద దస్తగిరి, రాయప్ప, శ్రీనివాసులు, నాగన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాపదిన్నె గ్రామంలో ప్రజల సమస్య పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి నారాయణలు అన్నారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడించి ఆందోళనలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులిశేఖర్, పుల్లయ్య, హుశేన్ పీరా, పృథ్వీ కుమార్, అమృతా రెడ్డి, మనోజ్, కొండయ్య, మనోహర్, పాపరాయుడు, శివ పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

డోన్ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో నరసింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వేర్వేరుగా ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీలను స్వీకరించారు.

'పాల సొసైటీలు రద్దు చేయడం సమంజసం కాదు'

శిరివెళ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : నంద్యాల విజయ డెయిరీ పరిధిలోని మూడు పాల సొసైటీలను యాజమాన్యం సరైన కారణాలు లేకుండా రద్దు చేయడం సమంజసం కాదని డైరెక్టర్ సూరా సుబ్బరాయుడు అన్నారు. శిరివెళ్లలోని పాల ఉత్పత్తిదారుల సంఘంలో సోమవారం ఆయన మాట్లాడుతూ టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నామనే నెపంతో రాజకీయ కక్షతో యాజమాన్యం తమను డైరెక్టర్లుగా అనర్హులమని ప్రకటించిందన్నారు. ఇటీవల జరిగిన పాలకవర్గ సమావేశంలో కోరం లేకుండానే కేవలం తొమ్మిది మంది డైరెక్టర్లతో తమపై అనర్హత తీర్మానం చేయడం చెల్లుబాటు కాదన్నారు. శిరివెళ్ల, పాణ్యం మండలం గోనవరం, నెరవాడ పాల సొసైటీలను రద్దు చేయడంతో బాధితులమంతా హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ట్రిబ్యునల్‌కు సిఫారసు చేసిందన్నారు. ట్రిబ్యునల్‌లో వాదోపవాదనలు ముగిసి తీర్పు వెలువడే వరకు మూడు సొసైటీలకు విజయ డెయిరీ యాజమాన్యం ఎన్నికలు నిర్వహించకూడదన్నారు.

రీ సర్వే పకడ్బందీగా చేయండి: తహసీల్దారు

సంజామల, మార్చి24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ రీ సర్వే ప్రాజెక్టు పనులను సమర్థవంతంగా చేపట్టాలని తహసీల్దార్ అనిల్ కుమార్ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మొదటి విడతగా సంజామల, ఆర్.లింగందిన్నె గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతాయన్నారు. సర్వే సిబ్బంది, మండల సర్వేయర్లు అప్రమత్తంగా ఉండి రైతులు అనుభవంలో ఉన్న భూములను సక్రమంగా రీ సర్వే జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసి క్రిష్ణ, మండల సర్వేయర్లు మల్లేశ్వరి, క్రిష్ణయ్య, సచివాలయ వీఆర్వో సుబ్బరాయుడు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి అనారోగ్యం

- రోగులకు వైద్యం కరువు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బేతంచెర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెంచిన ఫలితం ఉండటం లేదు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి 24 గంటల ఆసుపత్రిగా చెబుతున్నారే తప్పా సిబ్బంది పట్టుమని నాలుగు గంటలు పని చేయడం లేదు. ఉదయం 9గంటల నుంచి వైద్యులు ఓపీ మాత్రమే చూసుకుని వెనుదిరుగుతున్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి ఆసుపత్రిలో నర్సులు తప్ప వైద్యులు ఎవరూ ఉండకపోవడంతో ప్రమాదాలకు గురై ఆస్పత్రికి వచ్చిన వారి అవస్థలు వర్ణాణాతీంగా మారింది. ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో మందుల మాట దేవుడు ఎరుగుగాని, సిరంజిని కూడా బయటకు రాస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రికి కాన్పు కోసం వెళితే రూ.1500 నుంచి రూ.2వేల వరకు సిబ్బంది వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బేతంచెర్ల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో సామాన్యులకు మెరుగైన వైద్యం అందేలా జిల్లా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

సరైన వైద్యం అందేలా చర్యలు

రోగులకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యసిబ్బంది సమయపాలన పాటించేలా చూస్తున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ సాగరిక, సూపరింటెండెంట్,ప్రభుత్వ ఆసుపత్రి

పేదలకు వైద్యం అందడం కష్టం



కాయకష్టం చేసుకుని జీవనం సాగిస్తున్న పేదలు వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే సూదులు సైతం బయటనుంచి తెచ్చుకోమంటున్నారు. కాన్పు కోసం గర్భిణులు వస్తే స్కానింగ్ చేయించుకుని రావాలని వైద్యులు పంపుతున్నారు. పీహెచ్‌సీ స్థాయి పెంచినప్పుడు అందుకు తగ్గిన రీతిలో వైద్యసేవలు అందించాలి.

- రాముడు, బీఎస్పీ నాయకుడు

పని వేళలు పాటించడం లేదు



బేతంచెర్ల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. వైద్యం కోసం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పేదలకు వైద్యం అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలి.

- భార్గవ్, సీపీఐ మండల కార్యదర్శి

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయం సమీపంలోని కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని రూ.12 లక్షలు వెచ్చించి ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. బనగానపల్లె నియోజకర్గంలో వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణు గోపాల్, ఏఈ సాయికృష్ణ సమగ్ర చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే నందవరంలో మినరల్ వాటర్ ప్లాంట్‌నుంచి పైపలైన్ ద్వారా గ్రామస్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.వీ.కుమార్‌రెడ్డి, ఈవో కామేశ్వరమ్మ, సర్పంచ్ లక్ష్మీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, టీడీపీ నాయకులు వెంగన్న పాల్గొన్నారు.

రాములోరి కల్యాణంలో పాల్గొనండి

కొలిమిగుండ్ల : మండలంలోని పెట్నీకోట గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించనున్న రాములోరి కల్యాణోత్సవంలో పాల్గొనాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి కోరారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీతోనే పల్లె ప్రగతి సాధ్యం

ప్యాపిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పల్లె ప్రగతి సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బూరుగుల, సీతమ్మతండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. పల్లె పండుగ కార్యాక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేశామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సీతమ్మతండా గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, ఏఈ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

మండలంలోని ఏనుగమర్రిలో టీడీపీ నాయకుడు తిరుపాలు(60) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన వెంట నాయకులు రామక్రిష్ణ, అరిగెల శంకర్, సూర్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పందికోనకు రూ.250 కోట్లు కేటాయించాలి

- రాయలసీమ సాగు నీటి సాధన సమితి


సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

బేతంచెర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరుకు రూ2.50 కోట్లు కేటాయిస్తే లక్ష ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. 2012లో పందికోన రిజర్వాయరును అప్పటి ప్రభుత్వం జాతికి అంకితం చేసిందని అన్నారు. ఈ రిజర్వాయరు ద్వారా 61,400 ఎకరాలకు సాగు నీరు పారేదని, జాతికి అంకితం చేసిన తర్వాత పదివేల ఎకరాలకు కూడా అందడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పందికోన రిజర్వాయరుకు రూ.250 కోట్లు ఖర్చు చేసినట్లయితే లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పందికోన రిజర్వాయరు సాధన సమితికి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి, కోశాధికారి మహేశ్వరరెడ్డి, హరి, చంద్రమౌళి, ఈశ్వర్ రెడ్డి, మారుతి శర్మ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి సూచించారు. ఈ నెల 25 నుంచి 28 వరకు రుద్రవరం, కొండమాయపల్లె, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఎర్రగుడిదిన్నె, పేరూరు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ కార్డుల్లో తప్పొప్పులను సవరించుకోవాల న్నారు. అలాగే పీ-4 సర్వేను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

డోన్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో భూగర్భజలాలు తగ్గిపోయి తాగునీటి ఎద్దడి నెలకొంది. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామ సమీపంలో ఉన్న బోరులో 450 అడుగుల లోతులో పైపులు వేసి కొత్తమోటారు బిగించారు. లోతుగా పైపులు వేయడం వల్ల నీరు పుష్కలంగా రావడంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరిందని స్థానికులు చెబుతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఉడుములపాడు చెరువు ప్రాంతంలో బోరు వేసి పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు అన్నారు.

మేలు జాతి దూడల ప్రదర్శన


మేలు జాతి దూడను పరిశీలిస్తున్న అధికారులు

డోన్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో మేలుజాతి దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనను పశుగణాభివృద్ధి ఉమ్మడి జిల్లా కార్యనిర్వహణాధికారి రాజశేఖర్ ప్రారంభించారు. 46 మేలు జాతి లేగ ఆడ దూడలు, ఒంగోలు జాతి కోయ దూడలు ప్రదర్శనలో ఉంచారు. అనంతరం రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప సంచాలకులు శ్రీనివాసులు, పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు సహకరించాలి

చాగలమర్రి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫీడ్‌బ్యాక్ సర్వేకు రెవెన్యూ సిబ్బంది సహకరించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరారు. సోమవారం తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌లకు కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 700 అర్జీలు ఉండగా 90 శాతం రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీలు ఉన్నాయన్నారు. సమస్యలను సకాలంలో పరిష్కరించి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసేలా రెవెన్యూ సిబ్బంది సహకరించేలా చూడాలని కార్యదర్శులు కోరారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

చాగలమర్రి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ధ్యానం, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి అన్నారు. సోమవారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో గీతాపారాయణం, ఆరాధన, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తికి చెందిన స్వప్రకాశనంద, పీలేరుకు చెందిన కృష్ణానందసరస్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దైవమార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన స్వామిజీలు, ఆశ్రమ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఉయ్యాలవాడ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుచ్చకాయపల్లె గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో అంజనమ్మ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడి మానేసిన బాలికలకు పాఠశాల ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన ఫారాన్ని తమ పాఠశాలలో అందించాలన్నారు.

రేపు అంతర్జాతీయ సెమినార్

బనగానపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జంతుశాస్త్రం ఆధ్వ ర్యంలో క్షయవ్యాధిపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలిత, జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మహమ్మద్‌గౌస్ సోమవారం తెలిపారు. డ్రగ్ రెసిస్టెన్స్ ఇన్ ట్యూబర్క్యులోసిస్ అన్న అంశంపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో అధ్యాపకులు సమక్షంలో సెమినార్ బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్‌గౌస్, అధ్యాపకులు బాబునాథ్, సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బకాయిల విడుదలపై హర్షం: ఏపీటీఎఫ్

బనగానపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాము చేసిన అనేక పోరాటాల ఫలితంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యపై స్పందించి రూ.6,200 కోట్లు బకాయిలు సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేయడం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బనగానపల్లె ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మిలిగిన సమస్యలూ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, సుబ్బరాయుడు, గోవిందనాయక్, జె.వెంకట కృష్ణుడు, రమేశ్ పాల్గొన్నారు.

'ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలి'

బనగానపల్లె, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని బనగానపల్లె ఎస్సార్బీసీ ప్రాజెక్టు చైర్మన్ కాట్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తన కుమారుడు రెండు నెలల క్రితం మృతి చెందాడన్నారు. ఇందుకోసం ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు తిమ్మాపురం గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీఆర్వో సంతకం పెట్టారని, ఆర్‌ఐ ముడుపులు ఇస్తేనే సంతకం పెడతానని తెగేసి చెప్పినట్లు ఆయన ఆరోపించారు. ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తహసీల్దారు నారాయణరెడ్డిని వివరణ కోరగా విషయం ముడుపుల విషయం తన దృష్టికి రాలేదన్నారు. కాట్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఆర్‌ఐ పైవిచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

డోన్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలుగు సంవత్సరాది ఉగాది క్యాలెండర్-2025ను ఆవిష్కరించారు. త్రైత్త సిద్ధాంత ప్రబోధ సేవా సమితి- హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించారు. కార్యక్రమంలో ధర్మవరం, కృష్ణాపురం కమిటీ సభ్యులు శివప్రసాద్, నాగార్జున, నాగేంద్ర, శివకుమార్, సుబ్బయ్య, శ్రీను పాల్గొన్నారు.

ముస్లింలకు ఇబ్బందులు కలగనీయం

డోన్ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఈద్గాను శుభ్రం చేయించారు. కమిషనర్ ప్రసాద్‌గౌడు, వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్ సుంకయ్య, నాగేంద్ర, ఏఈ సురేష్, ఫొరెస్టు మౌలాలి, పెయింటర్ మాబు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం


ఆలమూరులో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

రుద్రవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధిని నిర్మూలిద్దామని వైద్యాధికారి అమరనాధరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు వివరించారు. తేమతో కూడిన దగ్గు, రక్తం పడడం, అలసట, నీరసం తదితర అనారోగ్య సమస్యలు, రాత్రిపూట చెమట, జ్వరం, ఛాతిలో నొప్పి, శరీర భాగంలో పుండ్లు, బరువు తగ్గడం లాంటి లక్షణాలుంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలోని చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చెన్నకేశవులు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: ప్రజలు క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ యమున అన్నారు. సోమవారం అవుకు పట్టణంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, టీబీ సూపర్‌వైజర్ నరసింహులు, పీహెచ్ఎన్ మల్లేశ్వరి, హెల్త్‌సూపర్‌వైజర్లు వేణుగోపాల్‌రాజు, వరలక్ష్మి, దానమ్మ, సీహెచ్‌వోలు పర్వీనా, జ్యోతి, ఏఎన్‌ఎంలు దానమ్మ, వెంకటేశ్వరమ్మ, మదారమ్మ పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామాల్లో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎల్‌టీ నాయక్, మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ముత్యాలపాడులో విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని మండల వైద్యాధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో దస్తగిరి, పీయం వోవో రమేష్, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ రామచంద్రయ్య ఉన్నారు.

శిరివెళ్ల: క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె : టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు అన్నారు. టంగుటూరు గ్రామంలో సోమవారం వరల్డ్ టీబీ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుహేల్‌బాబు, సిబ్బంది సరస్వతి, అయ్యమ్మ, హసీనా, ప్రభావతి, శివశంకర్‌గౌడ్, తులసి, ఆశావర్కర్లు గ్రామస్థులు పాల్గొన్నారు.


ఉయ్యాలవాడలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

సంజామల: క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని డాక్టర్ కృష్ణకుమారి అన్నారు. సోమవారం సంజామలలో క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణదాసు, హెల్త్ అసిస్టెంట్, ఆరోగ్య కార్యకర్త పురుషోత్తం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బేతంచెర్ల: సమాజంలో ప్రజలు టీబీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారి అబ్దుల్ సలీం అన్నారు. సోమవారం బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో గఫార్, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


సంజామలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


శిరివెళ్లలో ర్యాలీ..